క్లుప్తంగా

40 చలివేంద్రాలు ఏర్పాటు



తాడేపల్లిరూరల్: నగరంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు ముఖ్య కూడళ్లలో కార్పొరేషన్ అధికారులు సోమవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరగడంతో రహదారి వెంబడి ప్రయాణించేవారి దాహాన్ని తీర్చేందుకు దాదాపుగా 40 చలివేంద్రాలను ఏర్పాటు చేసి మట్టికుండలలో మినరల్ వాటర్‌ను అందజేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. ప్రతి చలివేంద్రంలోను కార్పొరేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధుడు కనబడటం లేదంటూ ఫిర్యాదు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు సెంటర్‌లో నివాసముండే ఓ వృద్ధుడు కనిపించడం లేదని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లి కొత్తూరు సెంటర్‌లో నివాసముంటున్న వీరభద్ర వెంకట అప్పారెడ్డి 15వ తేదీ ఉదయం 11 గంటల నుంచి కనిపించడం లేదని, బంధువులకు ఫోన్ చేసినా ఎటువంటి ఫలితం కనిపించలేదని అప్పారెడ్డి కుమారుడు నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వీరభద్ర వెంకట అప్పారెడ్డి ఆచూకీ తెలిసిన వారు 8688831555 నెంబరుకు సమాచారాన్ని అందజేయాలని ఎస్‌ఐ తెలిపారు.

వలంటీర్ల రాజీనామాలు



ఫిరంగిపురం: బస్సుయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించడంపై స్పందించిన వలంటీర్లు జగనన్నకు మద్దతుగా సోమవారం రాజీనామాలు అందజేశారు. మండలంలోని అమీనాబాద్ -2 గ్రామానికి చెందిన 16మంది వలంటీర్లు పి.రాజ్యలక్ష్మి, పార్వతీబాయి, పురానిభాయి, రమేష్, సద్దాం, రేవతి, రహంతుల్లా, కరిముల్లా, ఖుద్దూస్, జాన్‌సైదా, సబిహా, చాన్‌బాష, దిల్‌షాద్‌బేగం, రహమాన్, రేష్మ, అఫ్రిన్‌లు తమ రాజీనామాలు కార్యదర్శి ఏకే బాబుకు అందజేశారు. అదేవిధంగా బేతపూడి గ్రామానికి చెందిన 18 మంది వలంటీర్లు తమ రాజీనామాలను కార్యదర్శి లలితకుమారికి అందజేశారు. మేరికపూడి గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు అనూష, మౌనిక, రాధాకుమారిలు తమ రాజీనామాలను కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావుకు అందజేశారు.

నేడు శాంతిపేటలో ఆత్మీయ సమావేశం

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని శాంతిపేటలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రజలతో ఎమ్మెల్యే, తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె.చిన్నపురెడ్డిలు సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ పాల్గొంటారన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విమాదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

ఫ్యానుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కన్నయ్య మృతదేహం

గుంటూరు రూరల్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జూనంచుండూరు గ్రామానికి చెందిన సాదర బోయిన కన్నయ్య(36) మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంట సక్రమంగా పండక పోవటంతో దిగుబడి తగ్గింది. దీంతో నష్టం వాటిల్లింది. అప్పులు పెరిగి పోవటంతో తీవ్ర మనస్థాపానికి గురైన కన్నయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్థానికేతరులను నమ్మవద్దు

- స్థానికులను ఎన్నుకుంటేనే అభివృద్ధి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- పాత మంగళగిరిలో ఎన్నికల ప్రచారం



పాత మంగళగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి

మంగళగిరి: తమకు వారానికి మూడు రోజులు మంగళగిరి మూడు రోజులు హైదరాబాద్‌లో ఉండే విజిటింగ్ ప్రొఫెసర్ అవసరం లేదని.. ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే మీకే అండగా ఉంటామని ప్రజలు ముందుకు వచ్చి ఆశీర్వదించడంతోనే తమ విజయం ఖాయమైందని వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య స్పష్టం చేశారు. పట్టణంలోని పాత మంగళగిరిలో సోమవారం లావణ్య ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు సైతం పాల్గొని ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి లావణ్యను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్యలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ అపూర్వమన్నారు. బీసీ మహిళను గుర్తించి ఆశీర్వదించి టికెట్ ఇచ్చిన సీఎం జగనన్నతో పాటు ఎమ్మెల్యే ఆర్కే అన్న అండతో తాను తప్పకుండా విజయం సాధిస్తానన్నారు. డబ్బు సంచులతో గెలవాలనుకునే వారికి ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్పి తీరుతారన్నారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అధికారంలో వున్న ఐదేళ్లు కనీసం నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని లోకేష్ ఇప్పుడు గెలిపిస్తే అభివృద్ధి చేస్తానంటూ చెబుతున్న మోసపు మాటలు నమ్మడానికి మంగళగిరి ప్రజలు అమాయకులు కాదన్నారు. డబ్బు సంచులతో ప్రజలను కొని గెలవాలనుకుంటున్న లోకేష్, పెమ్మసానిలకు మంగళగిరి ప్రజలు తమ ఓట్లతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పోలీసుల వలయంలో వున్న లోకేష్‌ను స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలే కలవలేకపోతున్నారని, ఇక సామాన్యులు ఎలా కలుస్తారని ప్రశ్నించారు. ఇక పెమ్మసానిని కలవాలంటే అమెరికాకు వెళ్లి కలవాలంటూ ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి బీసీ మహిళ, విద్యావంతురాలు లావణ్యకు సీటు కేటాయించారని ప్రజలంతా లావణ్యను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్యలను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు డోకిపర్తి శ్రీనివాసరావు, ఊట్ల కళ్యాణ్, నాలి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్ సీపీ నేతల విస్తృత ప్రచారం



తాడేపల్లి కొత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కిలారి వెంకట రోశయ్య, మురుగుడు లావణ్యను గెలిపించాలంటూ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని రేపల్లె కనకదుర్గ వారధి రోడ్డు, తాడేపల్లి యాదవుల బజార్, తాడేపల్లి కొత్తూరు ప్రాంతాల్లో పార్టీ నేతలు తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, వార్డు, గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహిస్తుంటే పార్టీలతో సంబంధం లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తామని హామీ ఇస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తుంటే ప్రజల మద్దతు ఏ విధంగా ఉందో మనకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. సింకా గంగాధర్, ఆళ్ళ ఉమామహేశ్వరి, యాదిలి పూర్ణ శంకర్, హేమ పద్మజ, దొంతిరెడ్డి మల్లికార్జున రెడ్డి, తాళ్ళూరి ప్రభాస్ కుమార్, జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, వేముల శివయ్య, మేకా వెంకటరెడ్డి, జొన్నల నాగమణి, దొంతిరెడ్డి శ్యామల, సయ్యద్ యూసఫ్, షేక్ హుస్సేన్, కందుల వెంకయ్య, కళ్ళం రాజశేఖరరెడ్డి, గరుగు శ్రీనివాసరెడ్డి, బందాపు రుక్మాంగరెడ్డి, శేషారత్నం, శ్రీదేవి, ప్రమీలా రాణి, సోమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ దుర్గారావు, మహిళా సంఘం కన్వీనర్ అప్పికట్ల సంపూర్ణ పార్వతి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి భూపతి కిషోర్‌నాయుడు, సీతా, జరీనా, బూత్ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, భాస్కర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం

పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి



పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ స్వరూపరాణి, అతిథులు

తెనాలి : ప్రజలతో పనిచేస్తూ వారిని నడిపించే వారే ఆర్గానిక్ మేధావులని అంటారని, దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం ఆ కోవకు చెందుతారని ప్రముఖ రచయిత ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. అయితానగర్ పొట్టి శ్రీరాములు పార్కులోని కమ్యూనిటీ హాలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కనపర్తి ఏసురత్నంపై చల్లపల్లి స్వరూపరాణి సంకలనంలో వెలువరించిన 'ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి ఏసురత్నం' పుస్తక ఆవిష్కరణ, పరిచయ సభకు కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన స్వరూపరాణి మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో నాలుగు దశాబ్దాల పాటు దళిత సమాజం కోసం, కుల నిర్మూలన కోసం మార్క్సిజం, అంబేడ్కరిజం జమిలిగా ఉద్యమంలో కీలకపాత్ర వహించిన మహోన్నతుడు కనపర్తి ఏసురత్నం అన్నారు. ఆయన త్యాగాలు, ఉద్యమ జీవితం విస్మరించలేని వని, ఆయన అనుభవాలు భావితరానికి అవసరమన్నారు. ఆయన ఉద్యమ మిత్రులు తనతో కలిసి సమష్టిగా ఈ పుస్తకం తీసుకొచ్చినట్టు చెప్పారు. ఏసురత్నం ప్రతి వర్ధంతికి ఒక స్మారకోపన్యాసం ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. పుస్తకం తొలి కాపీని అందుకున్న కమ్యూనిటీ అండ్ రూరల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి మాట్లాడుతూ ఏసురత్నం నాస్తికుడైనా, మార్క్సిజం పట్ల, అంబేడ్కరిజంపైనా అచంచల విశ్వాసంతో దళిత ప్రజల అభివృద్ధికి కృషిచేశారని, అటువంటి వ్యక్తి జీవితాన్ని పుస్తకంగా తీసుకురావటం అభినందనీయమని చెప్పారు. ప్రధాన వక్త, న్యాయవాది పిల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ దళిత మహాసభకు ముందే ఏసురత్నం అనేక ప్రతిఘటన పోరాటాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. వేము సమత, పిల్లి వాసు, సిద్దెల అబ్రహాం, మేకతోటి ప్రభాకరరావు, కనపర్తి డేవిడ్ ప్రసంగించారు. డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ వందన సమర్పణ చేశారు.

నవ సమాజ నిర్మాణానికి ఓటు ఆయుధం



ప్రదర్శనలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాసులు, శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని దానిని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రానున్న ఎన్నికల్లో వినియోగించుకోవాలని కొల్లిపర తహసీల్దార్ ఎన్.శ్రీనివాసులు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో గుప్తా డిగ్రీ కళాశాలలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అందరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని సూచించారు. అందరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు లోనూ కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను హాజరైన వారితో చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, గుప్తా డిగ్రీ కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే అగ్ని ప్రమాదాల నివారణ



పొన్నూరు: ప్రజలు చైతన్యవంతంగా ఉండి అగ్ని ప్రమాదాలను నివారించాలని పొన్నూరు అగ్నిమాపక కేంద్ర అధికారి కె.ప్రసాదరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, ఆర్టీసీ బస్ డిపోలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు వ్యాపించిన మంటలను ఎలా అదుపు చేయాలి? వెంటనే చేపట్టాల్సిన చర్యలను అగ్నిమాపక సిబ్బంది చేసి చూపించారు. అగ్ని ప్రమాదాల నివారణకు చేయాల్సిన చర్యలపై ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్ని మాపక కేంద్ర సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 7.30 గంటలకు వరకు తాడేపల్లి, కుంచనపల్లి, పాతూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: వ్యక్తి మృతి

తాడికొండ: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందినట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల ప్రకారం బండారుపల్లి గ్రామానికి చెందిన బొందలపాటి లాజరు(48) అనే వ్యక్తి గ్రామంలో చర్చి తిరునాళ్ల సందర్భంగా పక్క గ్రామంలో ఉన్న తన స్నేహితుడికి క్యారేజీ ఇచ్చి తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టడంతో గాయాల పాలయ్యాడు. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కంతేరులో రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.30 లక్షల నగదును పట్టుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. కంతేరు శ్రీ సిటీ వెంచర్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన పత్తిపాటి వీరయ్య అనే వ్యక్తి కారులో రూ.1.30 లక్షల నగదును తీసుకొని వెళుతుండగా తనిఖీలలో పట్టుబడ్డాడు. అందుకు సంబంధించిన రశీదులు చూపించనందున ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి కవితల పోటీలు

ఫిరంగిపురం: రాష్ట్రస్థాయి కవితల పోటీలకు కవితలను ఆహ్వానిస్తున్నట్లు కొండవీడు రచయితల సంఘం అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కార్యదర్శి తొళ్లమడుగు గోవిందయ్య సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీలకు కవితలు పంపదల్చుకున్నవారు చక్కని పదాలతో 20 లైన్లకు మించకుండా, పొడుగు వాక్యాలు రాయకుండా ఉండాలని చెప్పారు. వాటితోపాటు హామీ పత్రం, పాస్‌పోర్టు ఫొటో, కవితను మూడు కాపీలుగా చేసి మే 15వ తేదీలోపు టి.గోవిందయ్య, కొత్తపేట, 14-198, ఫిరంగిపురం (పోస్టు), గుంటూరు జిల్లా చిరునామాకు పంపవచ్చని చెప్పారు. వివరాలకు 99663 85583 నెంబరులో సంప్రదించాలన్నారు. ప్రథమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యి నగదు అందజేస్తామన్నారు.

'మై డియర్ దొంగ' చిత్ర బృందం సందడి



పెదకాకాని: అభినవ్ గోమఠం, షాలినీ, దివ్యశ్రీపాద ప్రధానపాత్రల్లో సర్వజ్ఞకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ ఎంటర్‌టైనర్ మై డియర్ దొంగ చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ చిత్రం ఏప్రిల్ 19న ఆహా ఓటీటీలో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం సోమవారం మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా చిత్ర హీరో అభినవ్ గోమఠం మాట్లాడుతూ చిత్రం ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగుతుందన్నారు. ఇటీవల విడుదలైన చిత్ర టీజర్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. అనంతరం చిత్ర బృందం సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

అన్నివర్గాలకు మేలుచేసిన జగనన్న

- వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- బడేపురంలో ఎన్నికల ప్రచారం

తాడికొండ: కులమతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు మేలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని, అందుకే దేశంలోనే బెస్ట్ సీఎంగా కేంద్ర నివేదికలు వెల్లడించాయని వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. సోమవారం తాడికొండ శివారు బడేపురం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. తొలుత సీనియర్ నాయకుడు ఆళ్ళ హనుమంతరావు ఇంటి వద్దకు వెళ్ళి పరిచయం చేసుకున్న అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలో పర్యటించి ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవలు అంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనులు జరగని పరిస్థితులు ఉండేవని, కానీ నేడు సచివాలయ వ్యవస్థనే ప్రజలకు చేరువ చేసి, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను సీఎం జగనన్న అందిస్తున్నారన్నారు. పేదల కోసం ఒక్క మంచి పని కూడా చేయలేని చంద్రబాబు తాను ఎన్నికల్లో గెలవడం కష్టమని తెలిసి కూటమి పేరుతో ఓటర్లను ఆకర్షించేందుకు చేస్తున్న గారడీలను చేస్తున్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన బాబు మీకు ఇంత మేలు చేశాను నాకు ఓట్లు వేయండని అడగలేని పరిస్థితుల్లో ఉన్నాడని ఎద్దేవా చేశారు. సీఎం జగనన్న చేపట్టిన నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికీ మేలు జరిగింది కనుకనే గ్రామాల్లో తిరుగుతున్న తమకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడులకు ఉసిగొల్పుతున్నాడని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించి హింసను ప్రేరేపిస్తున్న చంద్రబాబుపై ఎన్నికల కమీషన్ చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తాడికొండతో పాటు రాష్ట్రంలో 175/175 సీట్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించి రాష్ట్రంలో కుట్ర పక్షాలను తరిమికొట్టడం ఖాయమన్నారు. సర్పంచ్ తోకల సరోజిని, మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, సొసైటీ చైర్‌పర్సన్ షేక్ నగీనా, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ఎంపీటీసీలు పాలడుగు దాసు, వలపర్ల కల్పన, బోడపాటి సుశీల, మాజీ సర్పంచ్ తుమ్మల రామస్వామిరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, మండల యువజన విభాగం నాయకులు ఆళ్ల హనుమంతరావు, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, వివిధ విభాగాల నాయకులు బెజ్జం సాయి ప్రసాద్, ఉండవల్లి నరసింహారావు, వంగా పోలారెడ్డి, మల్లంపాటి రాఘవరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, బాకి వెంకటస్వామి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బడేపురంలో వృద్ధురాలిని పలకరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం

- నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గంగరాజు
- పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం



ఈవీఎంల వాడకంపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

తాడికొండ: ఎన్నికల నిర్వహణలో సంబంధిత అధికారులకు సమయపాలన పాటించడం, పూర్తి అవగాహన కలిగి ఉండటం తప్పనిసరి అని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు సూచించారు. సోమవారం లాంచలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రజలందరూ తమ ఓటు హక్కును ప్రశాంతంగా త్వరితగతిన వినియోగించుకునేందుకు సిబ్బంది పనితీరు ప్రధానమన్నారు. అందుకోసం వారికి సరైన అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా సమావేశాన్ని ఉపయోగించుకొని ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఏడుగురు మాస్టర్ ట్రైనర్లచే 290 మంది పీఓలు, ఏపీఓలకు శిక్షణ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు మధుసూధన్ రావు, సుధీర్ బాబు, రాజ్యలక్ష్మీ, రాఘవేంద్రరావు, డీటీలు కాకుమాను ప్రసాద్, రమేష్ బాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తెనాలిరూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని తెనాలి జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై తెనాలి ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి కాల్చి అజాగ్రత్తగా పడేయడం, గ్యాస్ లీకవడం వంటి కారణాలతో ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. ఇళ్లలో వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమందించాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కోరిన కోరికలు తీర్చే కాశీవిశ్వేశ్వరుడు

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడు కాశీ విశ్వేశ్వరుడని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోర్లవారిపాలెం గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ముఖ్యఅతిథులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ స్వామి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభయ సీతారామాంజనేయ స్వామికి పూజలు..

అర్బన్ మండలం 41వ డివిజన్ స్వర్ణభారతినగర్ ఈ బ్లాక్ 4వ లైనులో నూతనంగా నిర్మించిన అభయ సీతా రామాంజనేయస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో బలసాని కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామి దయతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థికి సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.